క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్లో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాద రావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రం వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. 7వ వారం దాత, వాసవీ క్లబ్ కోశాధికారి పామిడి సుధాకర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పామిడి వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బ రత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సీలకు షూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలి

సంతనూతలపాడు: రాష్ట్రంలోని ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంకే సుబ్బారావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బ్యాంకుల్లో ఎస్సీ వర్గీయులకు కేటాయించే రుణాలకు ఓసీ వర్గీయుల్లో బ్యారన్ ఉన్న రైతులను హామీ కింద తెచ్చుకోవాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తేవడం దారుణమని అన్నారు. రుణాలకు సంబంధించి ఎస్సీ వర్గీయులను బ్యాంకర్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఎస్సీలకు షూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలని సుబ్బారావు కోరారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

ఒంగోలు మెట్రో: ఒంగోలు బలరాం కాలనీ పానుగుపాటి వీధిలో సోమవారం దుర్గా మల్లేశ్వరి, వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శింగోతు రమణయ్య, నిర్వాహకులు తెలిపారు. వేద పండితులు డాక్టర్ దీవి అనిల్ కుమార్ భాట్టాచార్య ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐక్యత వెల్ఫేర్ సొసైటీ, రూప మ్యాచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు సిటీ: విద్యార్థులు లేని, పది మంది లోపు విద్యార్థులు ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌సీ నంబర్ ఈఎస్ఈ 02/1701 ప్రకారం విద్యార్థులు లేని పది మందిలోపు విద్యార్థులు ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలను డైరెక్టర్ కార్యాలయానికి పంపి మిగులు ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విద్యార్థులు లేని 20 పాఠశాలల్లో పని చేస్తున్న 60 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి జూన్ 12వ తేదీలోగా ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు..

కోటా సత్యమాంబదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల వద్ద కోటా సత్యమాంబదేవి ఆలయం, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, సహస్ర నామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

బైక్ ఢీకొని యువకుడు మృతి

మార్కాపురం: బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామం వద్ద చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కవలకుంట్ల రాజ్‌కుమార్(28) తమ గేదెలను మేపుకొని ఇంటికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో ఉన్న మహ్మద్‌సాబ్ కుంట దగ్గరకు రాగానే యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి రాజ్‌కుమార్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి హుటాహుటిన మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీయడానికే సమ్మర్ క్యాంపులు

- ముగింపు సందర్భంగా నేర్చుకున్న అంశాలను ప్రదర్శించిన చిన్నారులు



సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులతో నిర్వాహకులు

సంతనూతలపాడు: ప్రకాశం బాలోత్సవం సంతనూతలపాడు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సుందరయ్య భవన్లో ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు 10 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్యాంపులో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. క్యాంపు కన్వీనర్ ఎస్.మాలతి మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, వికాసం అనే పేరుతో పిల్లలు సృజనాత్మకత కలిగి ఉండాలనే లక్ష్యంతో గత 3 సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన సమ్మర్ క్యాంపులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పిల్లల కోసం పెద్దలు ముందుకు రావాలనే ఉద్దేశంతో వివిధ అంశాల్లో ప్రత్యేకత కలిగిన వారు స్వచ్ఛందంగా క్యాంపులో పాల్గొని విద్యార్థులకు కొత్త విషయాలు నేర్పించారని తెలిపారు. 10 రోజుల పాటు మాలతి కె.కోటేశ్వరరావు, బుజ్జి ఈ కేంద్రాన్ని నిర్వహించారు. విద్యార్థులకు బొమ్మలు గీయడాన్ని రాధ నేర్పించారు. ప్రతి విద్యార్థి బొమ్మలు గీయడానికి ప్రయత్నించారు. క్రాఫ్టింగ్‌పై ఐద్వా రమాదేవి, వీరాస్వామి శిక్షణ ఇచ్చారు. న్యూస్ పేపర్, కలర్ పేపర్ ఉపయోగించి వివిధ రకాల బొమ్మలు తయారు చేయడం, పేపర్ కటింగ్ ద్వారా పలు ఆకారాలు చేయడం వంటి క్రాఫ్టింగ్ నేర్పించారు. శాస్త్రీయ ఆలోచన గురించి కోటేశ్వరరావు వివరించారు. సైన్స్ ప్రయోగాలను బాలోత్సవం కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం నేర్పారు. కొంతమంది మాయలు, మంత్రాల పేరుతో అమాయకులను ఎలా మోసం చేస్తున్నారు, వాటిని ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులచే కొన్ని ప్రయోగాలు చేయించారు. మ్యాజిక్ క్లాసులో మ్యాజిక్ రామన్ ప్రతి విద్యార్థికి ఒక అంశం నేర్పారు. ఎస్వీ నరసింహం, అబ్దుల్ మాలిక్, నెరుసుల వెంకటేశ్వర్లు క్యాంపులో పాల్గొని విద్యార్థులకు నీతి కథలు, పాటలు, ప్రకృతి వ్యవసాయం, కుటుంబ సంబంధాలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. దాతల సహకారంతో ప్రతిరోజూ విద్యార్థులకు స్నాక్స్, మ్యాజిక్ పరికరాలు, ఇతర మెటీరియల్, భోజనం అందించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్, కోటేశ్వరరావు, వి.సంపత్, మాలతి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేసి మానవ విలువలు, లౌకిక విలువలు, శాస్త్రీయ దృక్పథం, క్రమశిక్షణ, దేశభక్తి, ఆడపిల్లల పట్ల సమానత్వం, గౌరవం ఉండాలని, ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు పిల్లలు సహకారం అందించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడికి అభినందనలు



శంకర్‌ను అభినందిస్తున్న చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన కఠారి శంకరరావును ఆదివారం ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కఠారి శంకర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వాయుపుత్రుడికి విశేష పూజలు



రాజాపానగల్ రోడ్డులో చందన అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఒంగోలు కేశవస్వామిపేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, లాయరుపేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం, ముంగమూరు డొంక మర్రిచెట్టు కాలనీలోని పొలిమేరభయాంజనేయ స్వామి, ఐశ్వర్య నగర్‌లోని పంచముఖ ఆంజనేయ దేవస్థానం, గద్దలగుంటలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, ఒంగోలు మాత శిశు వైద్యశాల దగ్గర వీరాంజనేయ స్వామి దేవస్థానం, సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు, అలంకరణలు వైభవంగా నిర్వహించారు. సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో ఉపాలయమైన అభయాంజనేయస్వామి, గద్దలగుంట రాజాపానగల్ రోడ్డులోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్లకు ఆదివారం వివిధ రకాల పండ్లు, చందన అలంకరణలతో పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పండ్లు, డ్రైఫ్రూట్స్ అలంకరణలో అభయాంజనేయ స్వామి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలతో కుంకుమ బండ్ల ఊరేగింపు

ఘనంగా పేరంటాలమ్మ తిరునాళ్ళు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ–పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కుంకుమ బండ్లతో గ్రామోత్సవం వైభవంగా సాగింది. మహిళలు బోనాలు ఎత్తుకుని పేరంటాలమ్మ, పోలేరమ్మ ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కుంకుమ బండ్లకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, వైఎస్ జగన్ పాటలతో హోరెత్తించారు.



ప్రత్యేక అలంకరణలో పేరంటాలమ్మ

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే స్థానిక కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి అర్చకులు అమర్నాథ్ విశేషపూజలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆదివారమట.. వైద్యం చేయరట!

కొమరోలు: రోగులకు 24 గంటలపాటు సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యం చేసే దిక్కులేరు. కొమరోలు మండలంలోని రాజుపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఆదివారం విధులకు హాజరుకాలేదు. ఉదయం 11 గంటల సమయంలో ఒక స్టాఫ్ నర్సు తప్పించి ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఆదివారం ఉదయం వైద్యులు డుమ్మా కొట్టడంతో రోగులు ఇబ్బందిపడ్డారు.

రాత్రి వేళ సిబ్బంది నిల్

పీహెచ్‌సీలో రాత్రి వేళ స్టాఫ్ నర్సు అందుబాటులో ఉండాలి. కానీ ఏ ఒక్కరూ విధులు నిర్వర్తించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయాల్లో గిద్దలూరులోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి రాజుపాలెం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూసి ఉన్న వైద్యాధికారి-1 గది

పేదలకు దుస్తుల పంపిణీ

ఒంగోలు మెట్రో: ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం అనాథ వయోవృద్ధులకు పండ్లు, నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరరాఘవరావు మాట్లాడుతూ.. ప్రతి నెలా రెండో ఆదివారం ఫ్యామిలీ క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శివం నిత్యాన్నదాన సంచార వాహనం ద్వారా పట్టణంలోని యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి, బీకేవీ రమేష్, కేవీ సురేష్, టి.శ్రీనివాసరావు, కేవీ చంద్రమౌళి, తుమ్మపూడి బాబు, నల్లమల్లి రవి, పి.విజయ కృష్ణ, టి.రామకృష్ణ, మద్దాలి మధు, సామి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు వస్త్ర దానం పండ్లు పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



చుండూరి రవిబాబు, కఠారి శంకరరావు అభినందనలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు నివాసంలో 49వ డివిజన్ అధ్యక్షుడు గాలం సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సాంఘిక బహిష్కరణలు హేయం



నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: పిఠాపురంలో మాలలు సాంఘిక బహిష్కరణకు గురైనా దళితుల ఓట్లతో గెలిచిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కనీసం పరామర్శించలేదని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ అధ్యక్షుడు డి.సుందరం పేర్కొన్నారు. ఒంగోలు గాంధీ నగర్‌లోని మూడు బొమ్మల సెంటర్ వద్ద ఉన్న అండేడ్కర్ యువజన సంఘం కార్యాలయంలో కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం అగ్రకులాల వారు మాదిగ పల్లెను సాంఘిక బహిష్కరణకు గురిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అగ్రకుల పార్టీలకు వ్యతిరేకంగా దళితులు అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. జూన్ 1వ తేదీన ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో సంఘ ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జార్జి, సంగీతరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సబ్కా' ఉమ్మడి ప్రకాశం కమిటీ ఎంపిక

ఒంగోలు టౌన్: స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) ఉమ్మడి ప్రకాశం జిల్లా అడ్వైజర్‌గా కొట్టే కొండయ్య, కోఆర్డినేటర్‌గా కలవకొలను వెంకటేశ్వర శాస్త్రి, జాయింట్ సెక్రటరీగా వెన్నా శ్రీరాం రెడ్డి, ఈసీ మెంబర్లుగా బాచిన శ్రీనివాసరావు, ఈదర సాయిరామ్, మొలకల సునీల్‌బాబు, ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆడే రామ సుబ్బారావు ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సారా ఆస్టానాలో కమిటీ అధ్యక్షుడు కొమిరిశెట్టి వెంకటరావు నేతృత్వంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో గుంటూరు ప్రకాశం కమిటీ నుంచి ఈ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో కార్యదర్శి నడింపల్లి భూపతి సిన్హా, కో ఆర్డినేటర్ చాగంటి విష్ణువర్ధన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చోడగుడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. సువర్ణ అష్టదళ పద్మ పాదార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణంతోపాటు భారత భాగవత, భగవద్గీత, రామాయణ శ్లోకాలను గానం చేశారు. గాయకురాలు బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చతుర్వేద పారాయణంలో అర్చకులు

కొండా శ్రీనివాసులుకు జానపద కళాపీఠం అవార్డు ప్రదానం

ఒంగోలు సిటీ: ఒంగోలులో సీఎస్ఆర్ శర్మా కాలేజీలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేసి రిటైరైన డాక్టర్ కొండా శ్రీనివాసులుకు అద్దంకి జానపద కళాపీఠం రజతోత్సవాలను పురస్కరించుకుని జ్యోతి శ్రీరాములు స్మారక సాహిత్య పురస్కారాన్ని శనివారం రాత్రి ఆయనకు ప్రదానం చేశారు. సంస్థ రజతోత్సవాల సందర్భంగా జానపద కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ ఉబ్బా దేవపాలన, ప్రధాన కార్యదర్శి విద్వాన్ జ్యోతిచంద్రమౌళి మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ విస్తాలి శంకరరావు పాల్గొని విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. శ్రీనివాసులును డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఆచార్య తాళ్లపల్లి మనోహర్, డాక్టర్ రామచంద్రా రెడ్డి, వేణుగోపాల కృష్ణమూర్తి తదితరులు అభినందనలు తెలియజేశారు.



శ్రీనివాసులును జానపద కళాపీఠం అవార్డుతో సన్మానిస్తున్న నిర్వాహకులు